సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 31 । మే । 2023



గోదావరితో ఉత్తరాంధ్ర సుభిక్షం

ఉత్తరాంధ్రను గోదావరి జలాలతో అభిషేకించి సుభిక్షం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడుం బిగించింది.

10లో



ఆటో బోల్తా

దుచ్చరిపాలెం వంతెన వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఇద్దరికి గాయాలయ్యాయి.

10లో



ఘనంగా అనుపోత్సవం

పెదబయలులో నిర్వహిస్తున్న మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారం అనుపోత్సవంతో ఘనంగా ముగిశాయి.

10లో

న్యూస్‌రీల్

బాలుడి ప్రాణానికి అభయం

- రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ మాధవి భర్త శివప్రసాద్

కొయ్యూరు: మానవత్వం పరిమళించింది.. అది ఓ చిన్నారికి ఊపిరి పోసింది. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి నేరుగా ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) అధికారులతో మాట్లాడారు. రిలీఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలు వైద్యం కోసం మంజూరు చేశారు. చెక్కును మంగళవారం ఆమె భర్త శివప్రసాద్ ఎంపీ క్యాంప్ కార్యాలయంలో బాబు తల్లిదండ్రులకు అందజేశారు. పాడేరు మండలం గుత్తులపుట్టుకు చెందిన ఏడాది బాలుడు కొర్రా చైతన్య స్వరూప్‌కు వెన్నెముక సరిగా లేదు. దీంతో పాటు తలలో నీరు చేరింది. వారు పిల్లాడిని బతికించాలని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి అవస్థలు పడుతున్నారు. బాబుకు ఆపరేషన్ చేసేందుకు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైఎస్సార్‌సీపీ నేతల ద్వారా తెలుసుకున్న ఎంపీ మాధవి నేరుగా సీఎంఆర్‌ఎఫ్ అధికారులతో మాట్లాడి, నిధులు మంజూరు చేయించారు. ఆమె ఢిల్లీలో ఉండడంతో ఆ చెక్కును మంగళవారం ఆమె భర్త కె. శివప్రసాద్ బాధిత కుటుంబానికి అందజేశారు. సమస్యను తెలుసుకుని సకాలంలో స్పందించిన ఎంపీ దంపతులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ దేవతల జాతర్లు ప్రారంభం



కోలాటం ఆడుతున్న గిరిజనులు

గంగవరం: గిరిజన గ్రామాల్లో గ్రామదేవతలు గంగాలమ్మ, భూదేవి జాతరలు ప్రారంభమయ్యాయి.మూడు రోజుల పాటు ఈ జాతరలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ సందర్భంగా నృత్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గంగాలమ్మ, భూదేవి పండగలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. పొలిమేర్లలో గ్రామ దేవతల ఆలయాల వద్ద గ్రామదేవతలు కొలువుగా కొలిచే వృక్షాల ఉండే ప్రాంతాల్లో భారీ ఊయలలను ఏర్పాటు చేస్తారు. గంగవరం పాత బ్యాంక్‌వీధి వద్ద గంగాలమ్మ జాతరను స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ మంగళవారం ప్రారంభించారు. అమ్మవారి కలశానికి పూజలు చేశారు. గ్రామపెద్దలు మహిళలు, యువకులు భారీగా పాల్గొన్నారు.

జీసీసీ గోదాముల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్ ఉమాదేవి

చింతపల్లిరూరల్: గిరిజన సహకార సంస్థ జనరల్ మేనేజర్ ఉమాదేవి మంగళవారం స్థానిక జీసీసీ గోదాములను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, గోదాముల్లో ఉన్న నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోదాం సూపరింటెండెంట్ రమణమూర్తి పాల్గొన్నారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మూడో విడత చందనం అరగదీత శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. వచ్చే నెల 4న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని(120 కిలోలు) సమకూర్చేందుకు ఈ అరగదీతను ప్రారంభించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు సిబ్బంది 34 కిలోల చందనాన్ని అరగదీశారు. ఇంకా 86 కిలోల చందనం అవసరం కాగా మరో మూడు రోజులపాటు అరగదీత జరగనుంది.

నాలుగు దిక్కులు హోరెత్తేలా..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరిపారు. ఈ నాలుగేళ్లలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, అన్ని స్థాయిల్లో ప్రక్షాళన, విప్లవాత్మక మార్పులతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని ఆ పార్టీ నేతలు తెలిపారు. సరికొత్త సంక్షేమ, అభివృద్ధి పాలనను అందించి ప్రజల మన్ననలు అందుకున్నారు.

- అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు
- కేక్‌లు కట్‌చేసి సంతోషం వ్యక్తం చేసిన పార్టీ శ్రేణులు
- పలు చోట్ల సేవా, వితరణ కార్యక్రమాలు



కొయ్యూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీపీ, జెడ్పీటీసీలు



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



హుకుంపేటలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ రాజుబాబు

కొయ్యూరు/హుకుంపేట/రంపచోడవరం: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సేవా, వితరణ కార్యక్రమాలు జరిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పిలుపుతో పాడేరు, రంపచోడవరం, అరకులోయ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సంబరాలు నిర్వహించారు.

98.5 శాతం హామీలు అమలు

గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 98.5శాతం హామీలను సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొయ్యూరు జెడ్పీ అతిథిగృహంలో ఎంపీపీ,జెడ్పీటీసీలతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పేదల సంక్షేమమే పరమావధిగా నవరత్నాలు పథకాలను అమలు చేశారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రజలకు ఎన్నో మేళ్లు చేశారని చెప్పారు. ఒకప్పుడు పింఛన్ కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, ఇప్పుడు నేరుగా వలంటీర్లు ఇంటికే తెచ్చి ఇవ్వడంతో పండుటాకుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చేయూత, రైతులకు సాయపడేందుకు రైతు భరోసా, ఇస్తున్నామన్నారు.విద్య,వైద్యం,మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్టు చెప్పారు.వేలాది మంది గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను అందజేశామన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ నూకరాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ జె. రాజులమ్మ, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు,అప్పన వెంకటరమణ,బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సీనియర్ నేత సత్యనారాయణ,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, డౌనూరు,పెదమాకవరం ఎంపీటీసీలు బి అప్పారావు,మల్లేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గిరిజన ప్రాంతం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారని, ఈ నాలుగేళ్లలో గిరిజన ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిన సందర్భంగా హుకుంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం రోగులకు పాలు,రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అరకులోయ నియోజవర్గంలో అభివృద్ధి పనులకు రూ10.72 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.17.53 కోట్లు ఖర్చుచేసినట్టు చెప్పారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు తదితర సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు,వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఒంటుబు సామ్యూల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు,సర్పంచ్‌లు గుమ్మ శ్యామ్‌సుందర్,ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.రామకృష్ణ,పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, నాయకులు అనిల్,మహేష్,సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రంపచోడవరంలో ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వమని, పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి,కుంజం మురళి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్ మంగా బొజ్జియ్య తదితరులు పాల్గొన్నారు.

కుండపోత

- పలుచోట్ల విరిగిపడిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



జి.మాడుగులలో కూలిన చెట్టు



చింతపల్లి: ఈదురుగాలలకు నెలకొరిగిన వృక్షం


సాక్షి,పాడేరు: జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి పాడేరుతో పాటు పలు గ్రామాలు,ఘాట్‌రోడ్డులో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద శబ్దంతో పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పలుప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. హుకుంపేట మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.లోతట్టు భూములు చెరువులను తలపించాయి.

చింతపల్లిరూరల్: మండలంలో పలు చోట్ల సుమారు గంట సేపు ఈదురు గాలులు,ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలలకు పెద్దగెడ్డ వద్ద రోడ్డుపై భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

జి.మాడుగుల: మండలంలోని సింగర్బ, పి.జిమాడుగుల, నేరోడివలస, జీఎం కొత్తూరు, కంఠవరం, బందవీధి తదితర గ్రామాల్లో కుండపోతగా వర్షం పడింది. జి.మాడుగులలోని పాత ఎమ్మార్వో కాలనీలో భారీ వృక్షం కూలింది. దాని కిందే ఉన్న జీపుపై చెట్టు పడకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చెట్టు పడే సమయానికి జీపులో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. మండల పరిషత్ సమావేశం నిర్వహించే భవనంపై మరో చెట్టు కూలింది. భవనం పాక్షికంగా దెబ్బతింది.

పాక్ జైలులో నరకయాతన

- సీఎం జగన్ చొరవతో విముక్తి పొందాం
- ఇది మాకు పునర్జన్మే: మత్స్యకారులు



విశాఖ చేరుకున్న మత్స్యకారులు

మహారాణిపేట: 'పాకిస్తాన్ జైలులో ఐదేళ్ల పాటు నరకయాతన అనుభవించాం. ఇంటికి చేరుతామన్న నమ్మకం లేదు. ఇది మాకు పునర్జన్మే..'అని పాక్ బాధిత మత్స్యకారులు వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో తమ కుటుంబ సభ్యులను చూడగలుగుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. బతుకుదెరువు కోసం రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు.. గుజరాత్ వలస వెళ్లి చేపల వేట చేస్తుండగా పాకిస్తాన్ కోస్ట్‌గార్డు చేతికి చిక్కారు. ఐదేళ్ల పాటు అక్కడ నరకయాతన అనుభవించిన ముగ్గురు మత్స్యకారులు మంగళవారం విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు.

సరైన భోజనం లేదు



పాకిస్తాన్ జైలులో ఐదేళ్ల పాటు నరకం చూశాం. సరైన భోజనం కూడా పెట్టలేదు. బతకడం కోసం వారి పెట్టింది తిన్నాం. నా తండ్రి చనిపోయి రెండేళ్లు అవుతోంది. ఆ విషయం కూడా ఇప్పుడే తెలిసింది. తండ్రి కడసారి చూపు చూడలేకపోయాను. చాలా బాధగా ఉంది.

– మైలపల్లి భాస్కరరావు, కొయ్యాం, శ్రీకాకుళం జిల్లా

చచ్చి బతికాను



నా వయసు 60 ఏళ్లు. తరచూ అనారోగ్యానికి గురయ్యేవాడిని. అక్కడ జైలులో ఎలాంటి సదుపాయాలు లేవు. జబ్బు పడితే పట్టించుకునే నాథుడే లేడు. భాస్కరరావు నన్ను వైద్యులకు చూపించేవాడు. సహచర మత్స్యకారులు లేకపోతే ఎప్పుడో చనిపోయేవాడిని.

– మాదే అన్నవరం, తూర్పుగోదావరి జిల్లా

దేవుడి దయతో బయటపడ్డా..



చదువుకోకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డాను. పాక్‌లో అక్కడి జైలు సిబ్బంది మాట్లాడే భాష అర్థమయ్యేది కాదు. జైలులో నా ముందే వారు ఏదో మాట్లాడుకునే వారు. వచ్చీరాని హిందీతో ఐదేళ్లు గడిచిపోయింది. దేవుడి దయతో బతికి బయటపడ్డా.

– పెమ్మిడి నారాయణరావు, తూర్పుగోదావరి జిల్లా

దోమలపై దండయాత్ర

- ముమ్మరంగా మందు పిచికారీ
- జిల్లాలో 1,403 మలేరియా పీడిత గ్రామాల గుర్తింపు
- 1,170 మలేరియా గ్రామాల్లో తొలి విడత పిచికారీ పూర్తి



పాడేరు మండలం కుమ్మరిపుట్టులో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా కీటక జనిత వ్యాధుల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలు ప్రజలకు మేలు చేస్తున్నాయి.మలేరియా,డెంగ్యూ,ఫైలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమైన దోమల వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా దోమల నివారణ మందు పిచికారీకి మలేరియా,వైద్య ఆరోగ్యశాఖలు ఏప్రిల్ 18న శ్రీకారం చుట్టాయి. దోమల వ్యాప్తిని వివిధ దశల్లో నాశనం చేసే ఏసీఎం5 శాతం మందును ఈఏడాది కూడా మలేరియాశాఖ అందుబాటులోకి తెచ్చింది. దోమల నివారణ మందు పిచికారీని విజయవంతంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది,సచివాలయాల ఉద్యోగులు,వలంటీర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ భాగస్వామ్యం చేశారు.

1,170 గ్రామాల్లో పూర్తి

జిల్లాలోని పాడేరు,చింతూరు,రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలోని 62 పీహెచ్‌సీలున్నాయి. రాజవొమ్మంగి,జడ్డంగి, ఇందుకూరుపేట పీహెచ్‌సీలు మినహా మిగిలిన 59 పీహెచ్‌సీల పరిధిలోని 275 ఆరోగ్య ఉపకేంద్రాలకు సంబంధించి 1,403 మలేరియా,ఇతర కీటక జనిత పీడిత గ్రామాలను గుర్తించారు.ఈ గ్రామాల్లో దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు తొలిదశలో దోమల నివారణ మందు పిచికారీ పనులను ప్రారంభించారు.జూన్ నెలాఖరు నాటికి అన్ని గ్రామాల్లో పిచికారీ పనులు పూర్తి చేసే లక్ష్యంతో అన్ని ప్రభుత్వశాఖలు పకడ్బందీగా పనిచేస్తున్నాయి. ప్రతి నివాసం లోపల,బయట,పరిసరాల్లో దోమల నివారణ మందును పూర్తిస్థాయిలో పిచికారీ చేస్తున్నారు.ఇప్పటివరకు 1,170 మలేరియా పీడిత గ్రామాల్లో పిచికారీ పూర్తి చేశారు. మిగిలి ఉన్న 233 గ్రామాల్లో జూన్ మొదటి వారంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి ఇంటిలో మందు పిచికారీ



మలేరియా పీడిత గ్రామాల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు దోమల నివారణ మందు పిచికారీని విజయవంతంగా నిర్వహిస్తున్నాం.ప్రతి నివాసం లోపల,బయట కూడా పిచికారీ చేయడంతో మరింత మేలు జరిగింది. వైద్యబృందాలు,సచివాలయాల ఉద్యోగులు,వలంటీర్ల పర్యవేక్షణలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నాం.

– దాడి సాంబమూర్తి, జిల్లా మలేరియా నివారణ అధికారి, పాడేరు

ఆహా.. 'అరకు కాఫీ'

అరకు కాఫీకి అంతర్జాతీయంగా క్రేజ్ పెరుగుతోంది. ముఖ్యంగా సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న కాఫీ ఘుమఘుమలకు విదేశీయులు ఫిదా అవుతున్నారు. ఏజెన్సీలో గిరిపుత్రులు పండిస్తున్న కాఫీని ప్రైవేటు సంస్థలు ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నాయి. అయితే.. ఇకపై సొంతంగా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

- అంతర్జాతీయంగా డిమాండ్
- ఏజెన్సీలో సేంద్రియ పద్ధతుల్లో కాఫీ సాగు
- ఇప్పటికే అరకు కాఫీకి ఎన్‌పీవోపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్
- ప్రస్తుతం ప్రైవేట్ సంస్థల ద్వారా విదేశాలకు ఎగుమతి
- సొంతంగా ఎగుమతి చేసేందుకు జీసీసీ ప్రణాళికలు



సాక్షి, విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు ప్రాంతంలో పండే కాఫీకి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ మొదటి నుంచీ మంచి డిమాండ్ ఉంది. మన కాఫీ బ్రాండ్‌ను అరకు కాఫీ పేరుతో విదేశీ మార్కెట్‌లో మరింత సుస్థిరం చేస్తోంది. జపాన్‌లోనే కాకుండా.. బ్రెజిల్, అమెరికా.. తదితర దేశాల్లో అరకు కాఫీ అంటే ఆహా అనేవారు చాలా మంది ఉన్నారు. అత్యధికంగా కాఫీ తోటలను సాగు చేసే బ్రెజిల్‌తో పాటు మన దేశంలోని కర్ణాటకలో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న అరకు కాఫీ.. అంతర్జాతీయ మార్కెట్‌లో తనదైన ముద్రవేసుకుంది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న అరబికా, రోబస్టా చెర్రీ కాఫీ రకాలకు రానురాను మార్కెట్ పెరుగుతోంది. అల్లూరి జిల్లాలో ప్రస్తుతానికి రెండు క్లస్టర్లలో 2,258.55 హెక్టార్ల విస్తీర్ణంలో ఆర్గానిక్ పద్ధతుల్లో కాఫీని పండిస్తున్నారు. చింతపల్లి క్లస్టర్ వరుసగా మూడో ఏడాది నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీవోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ తీసుకోగా.. జీకే వీధి క్లస్టర్ ఇప్పటికే రెండుసార్లు స్కోప్ సర్టిఫికెట్ దక్కించుకుంది. మూడో ఏడాదీ సేంద్రియ సాగుకు సంబంధించి స్కోప్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది.

సొంతంగా విదేశాలకు ఎగుమతి కోసం...

అరకులో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న కాఫీ గింజల్ని బెంగళూరుకు చెందిన అనేక ప్రైవేట్ సంస్థలు సేకరిస్తున్నాయి. బ్రెజిల్, జపాన్, యూఎస్‌తో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే.. జీసీసీ సొంత బ్రాండ్‌తో దేశీయ మార్కెట్‌లో మాత్రమే కాఫీని విక్రయిస్తోంది. విదేశీ విపణిలో పెరుగుతున్న డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకుని ఇకపై సొంతంగా ఎగుమతులు చేపట్టాలని జీసీసీ భావిస్తోంది.

ఎన్‌వోపీ సర్టిఫికెట్ కోసం యత్నం



అల్లూరి జిల్లాలో అద్భుతమైన రుచి కలిగిన ఆర్గానిక్ కాఫీ ఉత్పత్తవుతోంది. ఆర్గానిక్ కాఫీని విదేశాలకు ఎగుమతి చేయాలంటే ప్రస్తుతం ఉన్న ఎన్‌పీవోపీ సర్టిఫికెట్ సరిపోదు. నేషనల్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌వోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ అవసరం. ఇందుకోసం ప్రయత్నిస్తున్నాం.

– సురేష్‌కుమార్, జీసీసీ ఎండీ

ఆర్గానిక్ సాగు పెంచేందుకు కృషి



అరకులో సేంద్రియ కాఫీ సాగును మరింత పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జీసీసీ నేరుగా విదేశాలకు ఎగుమతి చేస్తే.. ఇక్కడి రైతులు మరింత లాభాలు పొందే అవకాశం ఉంది. పార్చ్‌మెంట్ కాఫీకి కిలోకు రూ.285, చెర్రీకాఫీకి కిలోకు రూ.145 చొప్పున అందిస్తున్నాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

ఆర్గానిక్ కాఫీ సాగు ఇలా..

చింతపల్లి క్లస్టర్...

గ్రామాలు	సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
గొందిపాకల	500	362.50
లంబసింగి	500	334.00
కప్పాలు	300	188.05
మొత్తం	1300	884.55

జీకేవీధి క్లస్టర్‌లో..

గ్రామాలు	సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
జీకేవీధి	500	480.00
పెదవలస	500	630.00
యర్రచెరువు	300	264.00
మొత్తం	1300	1374.00

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు ఆర్‌ఐవో పి.ఉమారాణి తెలిపారు. మంగళవారం ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు 23,833 మందికి 22,049 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 92.51 శాతం నమోదైనట్లు వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం పరీక్షకు 6,734 మందికి గానూ 6,074 మంది విద్యార్థులు హాజరు కాగా.. 90.2 శాతం నమోదైందని తెలిపారు. మరో రెండు రోజుల్లో పరీక్షలు ముగుస్తాయని, పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి తప్పిదాలకు చోటు లేకుండా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. ప్రత్యేక స్క్వాడ్ బృందాలు కేంద్రాలను తనిఖీలు చేస్తున్నాయన్నారు.

పర్యాటకులు నిబంధనలు పాటించాలి

దేవీపట్నం: గోదావరి నదిలో బోట్లపై పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని దేవీపట్నం ఎస్‌ఐ కె.వి. నాగార్జున తెలిపారు. పోశమ్మగండి వద్ద ప్రయాణానికి సిద్ధంగా ఉన్న నాలుగు పర్యాటక బోట్లను మంగళవారం ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ప్రతిఒక్కరూ లైఫ్ జాకెట్లు ధరించాలని, బాధ్యతతో మెలగాలని సూచించారు. మద్యం, సిగరెట్లు బోటు ప్రయాణంపై నిషేధమని చెప్పారు.

క్లుప్తంగా

శరవేగంగా టోల్‌గేటు ఏర్పాటు పనులు



కాశీపట్నం సమీపంలోని ఏర్పాటు చేస్తున్న టోల్‌గేటు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం గ్రామ సమీపంలోని జాతీయ రహదారుల (ఎన్‌హెచ్516) సంస్థ టోల్‌గేటును ఏర్పాటు చేస్తుంది. ఇక్కడ రోడ్డు ఆనుకుని విస్తరణ పనులు చేపట్టారు. దాదాపుగా పనులు పూర్తయ్యాయి. తాత్కాలికంగా టోల్‌గేటుకు సంబంధించి రుసుం వసూలుకు కంటైనర్ ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో టోల్‌గేటును ప్రారంభించేందుకు, జాతీయ రహదారులు సంస్థ పనులను ఇప్పటికే వేగవంతం చేసింది. మరోవైపు వెంకయ్యపాలెం నుంచి బొడ్డవరకు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. వెంకయ్యపాలెం నుంచి చిలకలగెడ్డ వరకు దాదాపుగా రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయి. చిలకలగెడ్డ సమీపంలోని రెండు కల్వర్టు నిర్మాణంలో ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలతో కిషోర్

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జర్రెల పంచాయతీ ధోనిపుట్టు గ్రామానికి చెందిన కొర్రా కిషోర్ పెదబయలులో జరుగుతున్న మోదకొండమ్మ అమ్మవారి జాతరకు బైక్‌పై బయలుదేరాడు. వనభసింగి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి రహదారి సరిగా కనిపించకపోవడంతో రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. రాత్రి సమయంలో కావడంతో ఎవరూ గుర్తించలేదు. దీంతో రాత్రంతా గాయాలతోనే సంఘటన స్థలంలో ఉండేపోయాడు.మంగళవారం ఉదయం వనభసింగి గ్రామస్తులు గాయాలతో ఉన్న కిషోర్‌ను గుర్తించి,ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి పంపించారు.

ఘనంగా మోదకొండమ్మ అనుపోత్సవం

- అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు ఘటాల ఊరేగింపు
- అలరించిన గిరిజన వాయిద్యాలు, నృత్యాలు
- పోటెత్తిన భక్తులు



అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను మోస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు తదితరులు

పెదబయలు: గిరిజనుల ఐక్యతకు వనదేవత పండగే ప్రతీక. కోరిన కొర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారం అనుపోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచి ఆలయంలో భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 4 గంటల వరకు దర్శించుకున్నారు. ఉదయం భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఉత్సవ కమిటీ క్యూలైన్ ఏర్పాటు చేసి కొంత రద్దీని తగ్గించింది. సాయంత్రం 4. 30 గంటల నుంచి శతకం పట్టు నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు, కార్యదర్శి తలారి చక్రధర్ ఎత్తుకుని ప్రారంభించారు. శతకం పట్టు నుంచి సీతగుంట వరకు వెళ్లి అక్కడ నుంచి అమ్మవారి గుడి వరకు ఘటాల ఊరేగింపు సాగింది. సత్యసాయి ట్రస్ట్ సీకరి, రూడకోట నుంచి గురుస్వామి ఆధ్వర్యంలో ప్రసాదాలు పంచిపెట్టారు.

ఆకట్టుకున్న శక్తి వేషాలు:
అనుపోత్సవం సందర్భంగా పులి వేషాలు, వేంకటేశ్వరస్వామి శక్తి వేషాలు, మహిళల తీన్‌మార్ ఆకట్టుకున్నాయి. జిల్లాలోని నలుమూలల నుంచి, ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు వచ్చారు. అమ్మవారి గుడి వద్ద రాత్రి 8 గంటలకు భారీగా మందుగుండు సామగ్రిని కాల్చారు. ఎంటువంటి గొడవలు జరగకుండా జి. మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో గస్తీ నిర్వహించారు. స్వచ్ఛభారత్ డైరెక్టర్ సోమేశ్వరి, సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ బొంజుబాబు, స్థానిక ఉత్సవ కమిటీ నాయకులు గంపరాయి సూరయ్య, దడియా రామూర్తి, రాంబాబు, లంకా శ్రీనువాస్, పోతురాజు, అజయ్‌కుమార్, వర్తక సంఘాల నాయకులు, ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమ్మవారికి సమర్పించడానికి ఘటాలు తీసుకెళ్తున్న భక్తులు



వివిధ వేషాలతో భక్తులు



గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర సుభిక్షం

'బాబూ జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి' ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర సుభిక్షం కానుంది. వెనకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్రకు 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందించడమే కాకుండా.. పారిశ్రామిక అవసరాలను తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రెండో దశ భూసేకరణ ప్రక్రియ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర జిల్లాలకు సాగు నీరందించి తద్వారా ఆయకట్టును సస్యశ్యామలం చేయాలన్నది అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆలోచన. అయితే దురదృష్టవశాత్తు మహానేత మరణంతో ఈ ప్రాజెక్ట్ కుంటుపడింది. ఆ తర్వాత వచ్చిన పాలకులు దీన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై ప్రత్యేక దృష్టి సారించారు.

- ఐదు జిల్లాల్లో 8 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు
- పారిశ్రామిక అవసరాలనూ తీర్చనున్న ప్రాజెక్టు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రెండో దశ భూసేకరణ వేగవంతం
- అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,600 ఎకరాలు
- గ్రామ సభల ద్వారా 20 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి
- 2024 మే నాటికి జిల్లాలో భూసేకరణ ప్రక్రియ పూర్తే లక్ష్యం



పిసినికాడలో భూసేకరణకు సర్వే చేస్తున్న సిబ్బంది

సాక్షి, అనకాపల్లి : ఉత్తరాంధ్రను గోదావరి జలాలతో అభిషేకించి సుభిక్షం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడుం బిగించింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రూ.17,050.20 కోట్లతో ఏడాది క్రితమే రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతి కల్పించింది. ఇందులో తొలిదశ పనుల అంచనా వ్యయం రూ.2,022.20 కోట్లు కాగా రెండో దశ పనుల అంచనా వ్యయం రూ.15,028 కోట్లుగా నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు మహర్దశ పడుతుంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం తొలి, రెండో దశలో 63.99 కి.మీ. పొడవున ప్రధాన కాలువ, 3.98 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా డిస్ట్రిబ్యూటరీల పనులను ప్రభుత్వం ఇప్పటికే చేపట్టింది. ప్రధాన కాలువలో మిగిలిన పనులతోపాటు భూదేవి (అనకాపల్లి జిల్లా), వీరనారాయణపురం (విజయనగరం జిల్లా), తాటిపూడి (విజయనగరం జిల్లా) రిజర్వాయర్ల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వేగంగా పూర్తి చేసేలా అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టుగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ప్రభుత్వం చేపట్టింది. ఒకవైపు భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తూనే.. మరోవైపు పనులు చేపట్టడం ద్వారా వేగంగా ప్రాజెక్టును పూర్తి చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మొదటి, రెండు దశల్లో మిగిలి ఉన్న భూసేకరణ, సర్వే పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. మొదటి ప్యాకేజీలో కొంత భాగం డ్రాఫ్ట్ డిక్లరేషన్ దశలో ఉంది. సర్వే, దర్యాప్తు పనులు పూర్తయ్యాయి. డిజైన్ అనుమతులు పురోగతిలో ఉన్నాయి. రెండవ ప్యాకేజీ ప్రాథమిక నోటిఫికేషన్ దశలో ఉంది.

మిగిలిన పనులు వేగవంతం
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రెండో దశలో మిగిలిన పనులకు భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. అనకాపల్లి జిల్లాలో 1900 ఎకరాల జిరాయితీ భూమి, 700 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, గెడ్డ భూములు మొత్తం 2,600 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం ఇప్పటికే కశింకోట, సబ్బవరం, అనకాపల్లి రెవెన్యూల పరిధిలో 22 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. 20 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం.. రైతులకు అదనపు పరిహారం కూడా అందించనున్నారు. అంతేకాకుండా స్థలంలో చెట్లకు కూడా తగు పరిహారం అందించి ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోంది.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి హైలైట్స్
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోలవరం నుంచి రోజుకు 17,561 క్యూసెక్కులు (1.51 టీఎంసీలు) తరలించేలా పోలవరం ఎడమ కాలువను చేపట్టారు.
- పోలవరం ఎడమ కాలువ కింద 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తూనే 162.409 కి.మీ. నుంచి రోజుకు ఎనిమిది వేల క్యూసెక్కులను తరలించేలా డిజైన్ చేశారు.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2009 జనవరి 2న శంకుస్థాపన చేశారు.
- వైఎస్సార్ హఠాన్మరణంతో పనులకు గ్రహణం పట్టింది. ఆ తరువాత వచ్చిన పాలకులు చంద్రబాబుతో సహా ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టారు.

ఆటో బోల్తా



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుభద్ర

గూడెంకొత్తవీధి: చింతపల్లి నుంచి ప్రయాణికులతో గూడెంకొత్తవీధి వస్తున్న ఓ ఆటో మంగళవారం సాయంత్రం ప్రమాదానికి గురైంది. దుచ్చరిపాలెం వంతెన మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మేడా సుభద్ర, డ్రైవర్ గిరి గాయపడ్డారు. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

లైంగికదాడి ఘటనపై కేసు నమోదు

ఎటపాక: మండలంలో ఓ బాలికపై లైంగికదాడి జరిగిన ఘటనపై ఎటపాక పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కన్నాయిగూడెం గ్రామానికి చెందిన బాలిక కాపవరం గ్రామంలోని తన బంధువుల ఇంట్లో ఉంటోంది. ఆ సమయంలో ఆమెపై కొందరు లైంగికదాడి చేసినట్లు తెలిసింది. దాంతో గర్భం దాల్చటంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేయగా, మరో వ్యక్తి ఉన్నట్లు బాలిక చెప్పటంతో విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం బాలిక ఏడు నెలల గర్భిణి అని సమాచారం.

ఇరువర్గాలపై కొట్లాట కేసు నమోదు

యలమంచిలి : మండలంలో రేగుపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కొట్లాట కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కె .సన్నిబాబు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం రేగుపాలెం గ్రామానికి చెందిన రెడ్డి రమణ అనే వ్యక్తి జగనన్న కాలనీలో అవకతవకలు జరిగాయని స్పందనలో ఫిర్యాదు చేశారు. దీన్నిపై అధికారుల బృందం ఆదివారం రేగుపాలెం జగనన్న కాలనీని సందర్శించి విచారణ చేస్తుండగా ఆ సమయంలో ఇదే గ్రామానికి చెందిన షేక్ యాసీన్‌బాబు, రెడ్డి రమణ గొడవపడ్డారని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. ఇరువర్గాల దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'గడపగడపకు' రాని అధికారులపై ఆగ్రహం

- ఇక మీదట గైర్హాజరైతే నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పలు శాఖల అధికారులు రావడం లేదని పాడేరు ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ కార్యక్రమం చేపట్టినా రెండు, మూడు శాఖల అధికారులు మాత్రమే వస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గైర్హాజరయ్యే అధికారుల జాబితా ఇస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారని, వారిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక ఇవ్వలేదన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే ఇకమీదట ఫిర్యాదు చేస్తానన్నారు. కొన్ని శాఖల అధికారులకు ఏ గ్రామం ఏ పంచాయతీలో ఉందో తెలియడం లేదన్నారు. ఈ క్రమంలో నక్కలమెట్ట ఏ పంచాయతీలో ఉందో చెప్పాలని అడగ్గా.. అధికారులు చెప్పలేకపోయారు. గడపగడపకులో మారుమూల ప్రాంతాల్లో తిరుగుతున్నామన్నారు. అక్కడకు అధికారులు వస్తే ప్రజల కష్టాలు తెలుస్తాయన్నారు.

ఎంపీడీవోపై అసంతృప్తి
ప్రజాప్రతినిధులు ఇస్తున్న ఫిర్యాదులపై చర్యలు తీసుకోకపోవడాన్ని ఎంపీడీవో మేరీరోజ్ తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. మూలపేట, కినపర్తి, చిట్టింపాడులో వలంటీర్లపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టారు.

ఇక నుంచి ఎవరు వినతులు ఇచ్చినా వారికి విధిగా రసీదు ఇవ్వాలన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదిక(ఏటీఆర్)ను పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మూణ్నెల్ల తర్వాత నిర్వహించే సమావేశానికి వస్తానని తెలిపారు. గ్రామాల్లో పాడైన పాత బోరు పైపులు ఇస్తేనే, కొత్తవి ఇస్తామన్న నిబంధన లేదన్నారు. మండల సమావేశాలకు అనేక శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి ఎంపీపీ తీసుకొచ్చారు. వారి జాబితాలను ఇస్తే కలెక్టర్ దృష్టిలో ఉంచుతామని తెలిపారు. జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలు, కొప్పుల వెలమ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, తహసీల్దారు తిరుమలరావు, జేఈలు రామకృష్ణ, విశ్వతేజ, ఎంఈవో బోడంనాయుడు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్

పాడేరు రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఇది కొనసాగాలంటే కేంద్రంలో మళ్లీమళ్లీ బీజేపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ తన తొమ్మిదేళ్ల పాలనలో ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. కోవిడ్ కష్టకాలంలో ఉచితంగా వ్యాక్సిన్ వేయించి ప్రజల ప్రాణాలకు అండగా నిలిచారన్నారు.

ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం , స్వచ్ఛభారత్ మిషన్, మేక్ ఇన్ ఇండియా, అయోధ్యలో రామ మందిరం నిర్మాణం, యువత కోసం ప్రధాన మంత్రి కౌసల్ వికాస్ యోజన, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ, ఇలా ఎన్నో ప్రవేశ పెట్టారన్నారు. దేశంలోని అన్ని మారుమూల గిరిజన ప్రాంతాలు ప్రగతి సాధిస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో నెలరోజుల పాటు అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, రాష్ట్ర కార్యదర్శి మఠం శాంతికుమారి, పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు, ఎస్టీ విభాగం జోనల్ ఇంచార్జి కురుసా రాజారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సల్లా రామకృష్ణ, కె. రాఘవేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు శరభ వేమనబాబు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మతల్లి జాతర



శక్తివేషాలు దృశ్యం



ఊరేగింపులో థింసా నృత్యాలు

అరకులోయ: మండలంలోని యండపల్లివలసలో నిర్వహిస్తున్న గంగమ్మతల్లి జాతర మంగళవారం రాత్రితో ఘనంగా ముగిసింది. జాతరకు భక్తులు పోటెత్తారు.ఉత్సవాల చివరి రోజు గంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు సంబరాన్ని ఘనంగా నిర్వహించారు.పలు సాంస్కృతిక ప్రదర్శనలు,థింసా నృత్యాలు,శక్తి,పులివేషాలతో పాటు డప్పువాయిద్యాలతో ఊరేగింపు సంబరం హోరెత్తింది.

శారదా నదిలో గల్లంతైన
యువకుల మృతదేహాలు లభ్యం



వెదురుపర్తి వద్ద శారదానది నుంచి వెలికి తీసిన పిల్లి అనిల్ మృతదేహం



పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలింపు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి వద్ద శారదా నదిలో గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. విశాఖ నుంచి వచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం మృతదేహాలను వెలికి తీసింది. వెదురుపర్తి వద్ద నదిలో స్నానానికి దిగి యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పిల్లి అనిల్ (14), నక్కపల్లి మండలం చందనాడకు చెందిన ఏడిద ప్రసాద్ (17) సోమవారం గల్లంతైన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక ఈతగాళ్లు, అనకాపల్లి ఫైర్ సిబ్బందితో వెతికించినా వీరి మృతదేహాలు లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు నిర్వహించారు. దీంతో మునిగిపోయిన ప్రాంతంలోనే అనిల్, ప్రసాద్‌ల మృతదేహాలను గుర్తించి వెలికి తీశారు. వీటిని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి, అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

బావిలో పడిన వృద్ధుడిని కాపాడిన ఫైర్ సిబ్బంది



రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



శేషుబాబు

రావికమతం: ప్రమాదవశాత్తు బావిలో పడిన ఒక వృద్ధుడిని రావికమతం అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటికి తీసి కాపాడారు. రావికమతం సంతోషిమాత ఆలయం వద్ద మంగళవారం ఈ సంఘటన జరిగింది. ఆ గ్రామానికి చెందిన తలారి శేషుబాబు (62) మద్యం మత్తులో గ్రామంలోని సంతోషిమాత ఆలయం వద్ద గల వరనుయ్యిలో ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. కేంద్రం ఇన్‌చార్జి పీఏ స్వామి, శివయ్యనాయుడు, సిబ్బంది హుటాహుటిన వచ్చి బావిలోకి దిగి అతన్ని సురక్షితంగా బయటికి తీశారు. శేషుబాబుతో పాటు అతని కుటుంబ సభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.